# చతుర్భుజం

"నువ్విక్కడున్నావా భామా? నీ కోసం వెతకని చోటు లేదు" అంటూ దూసుకొచ్చాడు కపర్థి.

హోటలు వెనుక వైపు, చిన్న పూల పందిరి కింద, సిమెంటు బెంచీపైన కూచున్న భామ చివాలున లేచి నిల్చుంది.

"నువ్వూ యిక్కడే ఉన్నావా? భామను గదిలో వుండనివ్వకుండా లాక్కొచ్చేశావా?" అంటూ కపర్థి వురిమి చూశాడు నన్ను

"భామ ఒంటరిగా కూచోడం చూసి నేనొచ్చాను. నేనొచ్చినప్పటి నుంచీ ఆమె వెళ్లిపోతానని బయల్దేరుతూనే వుంది. బలవంతంగా ఆపుతున్నాను" అన్నాన్నేను తాపీగా.

"ముందుగా యీ వార్తను నీకే చెప్పాలని పరిగెత్తుకొస్తున్నాను భామా! మన నాటికకు ఫస్టు ప్రయిజు వచ్చింది. సాయంత్రం బహుమతి ప్రదానోత్సవం తర్వాత మన నాటిక ప్రత్యేక ప్రదర్శన వుండాలని కార్యకర్తలు పట్టుబడుతున్నారు." కపర్థి కంఠంలో అంతవరకూ అణచిపెట్టుకున్న ఆనందం కట్టులు తెంచుకుని పొంగుతోంది.

"కంగ్రాచ్యులేషన్స్ సాహిర్ గారూ!" అంది భామ బలవంతంగా నవ్వుతూ.

"శుభవార్తను తెచ్చింది నేను. నాటకాన్ని అంత గొప్పగా దర్శకత్వం చేసింది నేను. కంగ్రాట్స్ వాడికా?" కపర్థి ముఖం ముడుచుకుపోయింది.

"ముందు రచయిత, ఆ తరువాతే దర్శకుడు" అంది భామ మొహమాటంగా నవ్వుతూ.

"సరే పోదాం పద! యీ వార్తను మన వాళ్లందరికీ చెప్పాలి. ముందుగా సెలబ్రేషను. ఆ తరువాత రాత్రి ప్రదర్శనకు సన్నాహమూ...పదపద" అంటూ కపర్థి ఆమెను తొందరపెట్టాడు.

ఆమె యిబ్బందిగా ముఖం పెట్టింది.

"మీరిద్దరూ వెళ్లండి. నేనీలోగా సిగరెట్టు కాల్చుకుంటాను" అన్నాను. ఆమె సందేహిస్తూనే వో అడుగు ముందుకేసింది.

"సాయంత్రానికి నాకు జవాబు చెప్పాలి మరి" అన్నాను ఆమెకు మాత్రం వినబడేలా. ఆమె ముఖంలో అదోలాంటి నవ్వొకటి మెరవబోయి అంతలో ఆగిపోయింది.

కపర్థి వుత్సాహంతో మాట్లాడుతూనే నడుస్తున్నాడు. అతడి వెనుక భామ మౌనంగా సాగిపోయింది.

పరిషత్తు పోటీలప్పుడు నాటకాల ట్రూపులకు యే సత్రాల్లోనో, పాఠశాల గదుల్లోనో బస ఏర్పాటు చేస్తూ వుంటారు. కానీ యీ వూర్లో మాకు లాడ్జిలో గదులు యేర్పాటు చేయడం చూసేసరికి ఆశ్చర్యపోయాను. లాడ్జీ పాతదే! కానీ అన్ని సౌకర్యాలూ వున్నాయి. పెద్ద రెస్టారెంటుంది. వెనక చిన్న వుద్యానవనముంది. వొక్కో సమాజానికీ మూడు నాలుగు గదులు యిచ్చారు. స్త్రీ పాత్రధారి కావడంచేత భామకు వొక గదిని పూర్తిగా యిచ్చేశాం. రచయిత, దర్శకుడు హోదాలతో నేనూ, కపర్థీ వొక గదిని అక్రమించేశాం. మిగిలిన వాళ్లందరూ రెండు గదుల్లో సర్దుకున్నారు.

నిన్న రాత్రి మా నాటక ప్రదర్శనతో పోటీలు ముగిశాయి. మొదటి బహుమతి వచ్చిన నాటకాన్ని ప్రత్యేక ప్రదర్శనగా వేయించాలనే వుద్దేశంతో పోటీ ఫలితాలు తెల్లవారేసరికి ప్రకటించేశారు. మరోరోజు భామతో పాటూ వొకేచోట వుండగలిగే అవకాశం రావడంతో నేను ఆనందపడిపోయాను. యీ అవకాశాన్ని వూరికే వదిలి పెట్టకూడదని నా ప్రయత్నాలు నేను మొదలుపెట్టేశాను.

హోటల్లోకి వెళ్లబోతూ, వోసారి వెనుతిరిగి మొదటిసారిగా చూస్తున్నట్టుగా భామ నాకేసి చూసింది.

సరిగ్గా మూడు నెలల క్రితం, మరో వూరిలో, యిలాంటి పరిషత్తు నాటకాల పోటీల సందర్భంగానే ఆమెను మొదటిసారిగా చూశాన్నేను. ఆ రోజు సిగరెట్టు కాల్చుకోవడం కోసం మాకు బసగా యేర్పాటు చేసిన సత్రం మేడపైకెక్కి నిల్చున్నాను. సరిగ్గా అప్పుడే సెల్‌ఫోనులో యెవరో మాట్లాడుతూ వుండడం వినిపించింది. యెంతో ఆకర్షణీయమైన ఆడగొంతు. కవ్వించే నవ్వు...అవతల మాట్లాడుతున్న వ్యక్తి అదృష్టానికి అసూయపడుతూ ఆమెకేసి చూశాను. అప్పుడప్పుడే చిక్కనవుతున్న చీకటిలో ఆమె కరిగిపోతున్న వెలుతురు తీగలా కనిపించింది. ఆమె రువ్వుతున్న నవ్వులు నక్షత్రాల్లా మెరుస్తున్నాయి. ఆమె అలా ఎంతసేపు మాట్లాడిందో, నేనలా యెంతసేపు చూస్తూ వుండిపోయానో నాకే తెలియదు.

"ఎవరు మీరు? యిక్కడేం చేస్తున్నారు?" అంటూ ఆమె నేరుగా నన్నే సంధించడంతో వులిక్కిపడ్డాను.

"నేను...నేను.. రైటర్ని...రేపు డ్రామా... యీ రోజు..." అంటూ తడబడిపోయాను.

"యిలా అవతలివాళ్ల మాటల్ని దొంగతనంగా విని, ఆ సంగతుల్ని నాటకాలుగా రాస్తారు మీరు? యిదేం బుద్ధి?" అని విసుక్కుంటూ ఆమె మెట్లు దిగి వెళ్లిపోయింది. సరిగ్గా అప్పుడే "కొంప మునిగిందిరా సాహిర్! మన హీరోయిన్‌కు జ్వరం.. టైఫాయిడ్.. రేపు రాత్రికి మన నాటకం గతేమిటి?" అని మొత్తుకుంటూ సత్రం మేడపైకి వచ్చాడు కపర్థి. మరునాటి వుదయానికల్లా ఆపద్ధర్మంగా మరో నాటకం నుంచీ హీరోయిన్ పాత్రధారిని అరువు తెచ్చేశాడతను. వొకరోజులో తన పోర్షను నేర్చుకుని, సాయంత్రానికల్లా ప్రదర్శననివ్వగలిగే ఆ రాక్షస నటి యెవరా అని యెదురు చూశాను.

"నిన్న సాయంత్రం నా మాటల్ని దొంగతనంగా విన్నది మీరేగదా?" అని దబాయిస్తూ ముందుకొచ్చింది భామ.

"యీ రోజు గండం గడిచిందంటే చాలు.. నీకోసం మావాడి చేత ప్రత్యేకంగా నాటకం రాయిస్తాను. ప్రామిస్" అన్నాడు కపర్థి

ఆ రోజు సాయంత్రం నాటకం రక్తిగట్టిందో లేదో యెవరికి తెలుసు? కానీ నాటకం ముగిసేసరికి మంత్రం వేసినట్టుగా కపర్థి భామకు నీడగా మారిపోయాడు.

నాటక ప్రదర్శన ముగిసిన తర్వాత అభినందించడానికి వచ్చిన అభిమానులతో "నాదేముంది సార్! అంతా రచయిత ప్రతిభ! ఆ డైలాగులు ఎవరు చెప్పినా చప్పట్లే!" అంది భామ నా వైపు చూస్తూ...

"సంభాషణలదేముంది లెండి? అంతా మా కపర్థి దర్శకత్వ ప్రతిభ" అన్నాన్నేను మర్యాదకోసం.

"ముందు స్క్రిప్టు... తర్వాతేగదా దర్శకుడు" అంది భామ కపర్థి వైపు కోరగా చూస్తూ.

"అంతేలే! నటీనటుల ప్రతిభ ఆ వరసలో చివరిదే!" అంటూ కపర్థి వుడుక్కున్నాడు.

భామ పకపకా నవ్వింది. ఆ నవ్వుల డోలికల్లో పడి కొట్టుకుపోయిన తర్వాత దూరం నుంచీ తిరిగి చూశాను. కపర్థి ఆమె నవ్వుల్లోంచీ రాలిన ముత్యాలనేరుకుంటున్నాడు.

"యిక నా నాటకాల్లో భామే పర్మినెంటు హీరోయిన్" అన్నాడు కపర్థి.

"భామకంటే ఆ పాత హీరోయినే బాగా చేస్తోంది" అని కావాలని వాదించాను.

"నీ ముఖం. రాయికీ, రత్నానికీ మధ్య వుండే తేడా నీకు తెలియదు" చీవాట్లేశాడు కపర్థి. అంతేకాదు, ఆ రోజు సాయంత్రమే ఆమెకు అడ్వాన్సుగా పదివేలు యిచ్చాడు. అది చాలదని బోనస్‌గా పట్టుచీర కొని పెట్టాడు. ఆ సంగతులన్నీ ఆమే చెప్పింది నాతో.

"నేను మామూలు రచయితను. నా దగ్గర అంత డబ్బు లెక్కడుంటాయి? పాత కవులైనా అయితే పద్యరత్నాలు రాసిచ్చేవాళ్లు. నేను ఆధునిక రచయితనైపోయాను. 'నువ్వొక మెరుపుల చెట్టు.. నీ నవ్వులు తారకల పట్టు... నీ మౌనం రాగాల ఆలయం... నీ పలుకు శబ్దాల కులుకు' అంటూ కేవలం వచనంలో కవిత్వం రాయడం మాత్రమే వచ్చు నాకు" అన్నాను. భామ పర్సులోంచీ పదివేలు తీసి నా వొడిలో వేసి "మీ కవితకు యిదిగో అక్షర లక్షలు" అంది.

"యిది కపర్థి యిచ్చిన డబ్బు. నీ సంపాదన... నాకొద్దు" అని వుడుక్కున్నాను.

"యిప్పుడది మీ సంపాదన" అందామె యెంతో పరవశంగా.

తన సంపాదనను నాకెందుకిచ్చేస్తోందామె? డబ్బుకంటే విలువైనదాన్ని ఆమె నానుంచీ ఆశిస్తోందా? నేను అయోమయంలో మునిగి తేలుతూ ఆ డబ్బును బలవంతంగా ఆమె పర్సులోకి తోసేశాను.

ఆ సాయంత్రమే కపర్థి నా దగ్గరికొచ్చి "భామ ఆ పదివేలూ నాకు తిరిగిచ్చేసిందిరా సాహిర్!" అన్నాడు. "మధ్యాహ్నం వో షోకిలాగాడొచ్చి ఆమెను అల్లరి చేయబోయాడు. నేను వాడికి రెండు తగిలించి 'యెవరనుకుంటున్నావురా? మా యింట్లో వ్యక్తులపైన చెయ్యేసేటంత ధైర్యమా నీకు?' అని కసిరాను. కాస్సేపటి క్రితం మార్వాడీ వచ్చి అప్పు కట్టమని కూర్చున్నాడు. నేనెంత బతిమాలినా వాడు పోలేదు. యింతలో భామ ఆ పదివేలూ తీసుకొచ్చి వాడి ముఖాన కొట్టింది. యిదేమని అడిగితే 'వొకే యింట్లో వుండే వ్యక్తులకు ఆ మాత్రం స్వాతంత్ర్యం వుండదా?' అని రెట్టించింది" అన్నాడు.

కాస్సేపాగాక... "పాపం భామ తండ్రి ఆమె చిన్నప్పుడే చనిపోయాడట! తల్లిగూడా ఆ మధ్యలో పోయింది. యింటికి ఆమె పెద్ద... యిద్దరు తమ్ముళ్లను చదివించాలి. అందుకనే యీ నాటకాల్లో దిగి సంపాదిస్తోంది" అంటూ చెప్పుకుపోయాడతను.

కొద్దిరోజులుగా నేనెక్కి వూరేగుతున్న వూహల విమానం అమాంతంగా కూలిపోయి నట్టయింది. నా అసహనాన్ని దాచుకోలేక అక్కడి నుంచీ విసవిసా వెళ్ళిపోయాను.

భామ వొంటరిగా కనిపించగానే "కపర్థి యింట్లో దిగిపోయావటగా? కంగ్రాట్స్" అన్నాను కచ్చుగా.

"మరచిపోయారేమో! నేనీమధ్య కవులకు అక్షరలక్షలు యిస్తున్నాను" అందామె ఠీవిగా.

"యీ రెండింటిలో ఏది నిజం?" అని అడిగాను నీరసంగా.

"రెండూ! అది గౌరవం, యిది అభిమానం" అంది భామ.

గౌరవం - అభిమానం రెండూ ప్రేమకు మారుపేర్లు కదా! యిలాంటి అనేక అనురాగాల పునాదులపైనే ప్రేమ నిర్మితమవుతుందని పుస్తకాల్లో చదువుకున్నాను. ఆమె యీ మూడునెలల్లో నాకెంత దగ్గరయ్యిందో, కపర్ధికీ అంతే చేరువయినట్లుగా నాకనిపిస్తోంది. యిది కేవలం వొక నటి తన ప్రయోజనాల కోసం దర్శకుడికీ, రచయితకూ సన్నిహితురాలు కావడంలా నాకనిపించడం లేదు. యిద్దరు పెళ్ళికాని యువకులూ, వొక అవివాహిత స్త్రీ మధ్య యేర్పడిన యీ త్రికోణంలో అన్ని కోణాలూ సమానమెలా అవుతాయి? యీ తేడా భామ గుర్తించలేకపోతోందా?

"యీసారి భామకోసం ప్రత్యేకంగా నాటకం రాయాలి నువ్వు. హీరోయిన్ వోరియంటెడ్.. ఆమె ప్రతిభకు అది పూర్తిగా న్యాయం చేసేలా వుండాలి. యిది నీకూ, ఆమెకూ పోటీ!" అన్నాడు కపర్ధి.

"తప్పకుండా రాస్తాను. యిది నా రచనకూ, నీ దర్శకత్వానికీ కూడా పోటీ" అన్నాను.

"మీ యిద్దరిలో యెవరునెగ్గితే వాళ్లకు ప్రత్యేక బహుమతినిస్తాను" అంది భామ.

"అది నాకే!" అరిచాడు కపర్ధి.

"కాసుకో చూద్దాం!" రెట్టించాను నేను.

నాటక రచన సాగుతున్నంతకాలం నేను వేరే ప్రపంచానికి వెళ్లిపోయాను. నిజమైన లోకాన్ని మరచిపోయి నా వూహల్లోనిపాత్రలతో మమేకమైపోయాను. ఆ పాత్రల సంఘర్షణల్లో నేను తబ్బిబ్బుపడుతున్న సమయంలో "యేం రాస్తున్నారో చెప్పగూడదా? అదంత రహస్యమా?" అని బతిమాలింది భామ.

"నీ దగ్గర రహస్యాలేమున్నాయి నాకు?యిప్పుడిప్పుడే రాయడం ముగుస్తోంది. యిద్దరు యువకులు, వొక స్త్రీ. వాళ్ల ప్రేమకథ..." అన్నాను.

"లవ్ ట్రయాంగల్.. అంతే గదా!" భామ నవ్వేసింది.

"వస్తువు పాతదే! ట్రీట్‌మెంటు కొత్తది. కథానాయిక పేరు స్వప్న. మొదటి కథానాయకుడి పేరు చందూ...వాడు కవి. రెండోవాడు సుందూ.. వాడు లౌకికుడు. వాళ్లిద్దరూ స్వప్నను ప్రేమిస్తారు. తమాషా ఏమిటంటే స్వప్న కూడా యిద్దరినీ ప్రేమిస్తుంది. యిద్దరిలో యెవరిని యెన్నుకోవాలో తెలియక సతమతమైపోతుంది. ఆమెకు చందూలో వుండే సృజనాత్మకత, సుందూలో వుండే ప్రయోజకత్వమూ రెండూ కావాలి. చందూలో వుండే సున్నితత్వమూ, సుందూలో వుండే కాఠిన్యమూ రెండూ కావాలి..."

"యిదేం కథ? యిలా ఎప్పుడూ జరగదు..." అంటూ భామ అడ్డు తగిలింది.

వో నిముషంసేపు ఆగి, ఆమెనే సూటిగా చూశాను. తర్వాత నవ్వేసి "యిదేం కొత్త కథ కాదు. పాతకథే.. యెప్పుడో బృహద్రథుడు కథాసరిత్సాగరంలో యీ సమస్య గురించే రాశాడు. యిద్దరు యువకులు వొక స్త్రీని ప్రేమిస్తారు. ఆమె ముందుగా వొకర్ని పెళ్లాడు తుంది. తరువాత తనకు యింకొకరి పైనా మరులున్నాయని తెలుసుకుంటుంది. యింతలో ఆ యువకులిద్దరూ వో పాత కాళికాదేవి ఆలయంలోకెళ్లి కత్తియుద్ధం చేస్తారు. వొకరి తలను యింకొకరు నరికేసుకుంటారు. ఆలయానికొచ్చి విలపించిన ఆ స్త్రీకి కాళికాదేవి, వాళ్ల తలలను మొండాలకు చేర్చితే వాళ్లు సజీవులైపోయేలా వరమిస్తుంది. అయితే అప్పుడామె తలలనూ మొండాలనూ కావాలని మార్చేస్తుంది. ప్రాణం వచ్చాక భర్త అంటే తలే అని వొకరూ, కాదు మొండెమే అని మరొకరూ పోట్లాడుకుంటారు. యీ సమస్యకు పరిష్కారం లేకపోవడంతో మళ్లీ పరస్పరం చంపుకుంటారు. ఆ స్త్రీ ప్రాణత్యాగం చేస్తుంది. అదొక విషాద గాథ...." అని వివరించాను.

"యింత పాత కథ యిప్పుడవసరమా?" భామ విసుక్కొంది.

"పాతదైనంత మాత్రాన కథలో ఉండే సమకాలీనత పోతుందా? యిదే కథను ఆంగ్లంలోకి అనువదించిన విదేశీ రచయిత వొకతను దీంట్లో హృదయానికీ, శరీరానికీ మధ్యలో వుండే సంబంధాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించాడు. బృహద్రథుడి నైతిక సంఘర్షణ చిత్రణను అతనలా మార్చుకున్నాడు. యిదే కథను నాటకంగా రాసిన కన్నడ రచయిత యిందులో 'పరిపూర్ణత' గురించి చర్చిస్తున్నట్టుగా కనిపిస్తూ ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాడు..." నేను వుత్తేజంగా చెప్పుకుపోయాను.

"మరి యీ పాత ఆయుధాన్ని మీరు దేని కోసం వాడుకుంటున్నారు?" భామ గొంతులో వ్యంగ్యం కూడా కవ్విస్తోంది.

"నా కథనాయిక స్వప్నను వాళ్ల నాన్న బలవంతంగా ప్రయోజకుడికిచ్చి పెండ్లి చేస్తాడు. యేదో తుపానులో తగులుకున్న ప్రయోజకుడు తిరిగి రాడు. అతడు చనిపోయాడనుకున్న స్వప్న చందూను పెళ్లాడు తుంది. కొద్దిరోజుల తర్వాత మొదటి మొగుడూ తిరిగొస్తాడు. స్వప్నకిదివరకే పుట్టిన బిడ్డకు తాను తండ్రంటే తాను తండ్రని వాళ్లు పోట్లాడుకుంటారు. స్వప్నకు యిద్దరితోనూ సంసారం చేయాలని వుంటుంది. కానీ అందుకు సమాజం వొప్పుకోదు."

"యిదేం పిచ్చికథ?" భామ విసుగ్గా అడ్డుతగిలింది.

"మనిషి మనస్సుకంటే పిచ్చిది మరేముంటుంది? వ్యక్తులు సాధారణంగా తమలో గూడా యిలాంటి సంఘర్షణ వుందని గుర్తించరు. యింకొందరు గుర్తించినా, గుర్తించనట్లే

నటిస్తారు" ఆమె ముఖంలో రంగుల్ని గమనిస్తూ మరి కాస్త వివరించాను.

ఆమె ముఖాన్ని అవతలకి తిప్పుకుంది.

"యీ కథకు నేను కొత్త మలుపు ఇచ్చాను. బిడ్డలో తన పోలికలు తక్కువగా వున్నాయని తెలుసుకున్న సుందూ కోపంతో మండిపడతాడు. స్వప్నను చంపేయాలనుకుంటాడు. అయితే పొరబాటున ఆమె తాగాల్సిన విషాన్ని తాను తాగేస్తాడు. స్వప్న చందూతో జీవితాన్ని కొనసాగిస్తుంది. యీ మలుపు యెలాగుంది?" అని అడిగాను. భామ జవాబివ్వకుండా లేచి "మీ కథ, మీ ఇష్టం...." అంది.

నాటక రచన ముగిశాక కపర్ధి నేనిచ్చిన ముగింపు కొప్పుకోలేదు. చివరిలో ప్రయోజకుడి స్థానంలో సృజనశీలే వుండాలనీ, స్వప్న ప్రయోజకుడితో మిగిలపోవడమే వాస్తవికంగా వుంటుందనీ వాదించాడు. నాకు కోపం వచ్చి తన యిష్టం వచ్చినట్లుగా మార్చుకోమని చెప్పాశాను. ఆ మార్పులేవో అతనే చేసుకున్నాడు.

"అయితే ఒక షరతు. దీనికొప్పుకుంటేనే నా నాటకం నీకిస్తాను. యీసారి ఆ సృజనశీలి పాత్రను నేనే వేస్తాను" అన్నాను. కపర్ధి మంచి దర్శకుడే కానీ రంగస్థలంపైకి రావాలంటే బెదిరిపోతాడు. కాబట్టి అతను ప్రయోజకుడి పాత్రను వేసే అవకాశమే లేదు. నేనీ వేషం వేసే మిషతో భామకు మరింతగా సన్నిహితుడ్ని కావచ్చుని నా యెత్తు.

ప్రయోజకుడి పాత్రకు కపర్ధి కొత్త వ్యక్తిని యెన్నుకోక తప్పలేదు. అతగాడు చూడ్డానికేం బాగుండడు. నల్లగా మొరటుగా వుంటాడు. అతడికి చాలా రోజులుగా నాటకాల్లో వేషం వేయాలని కోరికుంది. అతడి దగ్గర కావాల్సినంత డబ్బుంది. కానీ అతడ్ని కథానాయకుడిగా భరించే వాళ్లెవరూ లేరు. అతడ్ని యెన్నుకోవడం వల్ల కపర్ధికి రెండు ప్రయోజనాలు కలిగాయి. మొదటిది, అటువంటి వ్యక్తి కూడా రెండవవాడికంటే మెరుగని భామకు చెప్పకనే చెప్పవచ్చు. రెండవది, అతను కావాల్సినంత ఆర్థిక సహాయమూ చేస్తాడు. అతడి పేరు శ్రీవత్స.

పూల పందిరి జల్లెడగా మారి యెండను నా పైకి చినుకుల్లా రాల్చుతోంది. హోటల్ వరండాలోకి చేరిన మా నాటక బృందమంతా తప్పట్లతో హోరెత్తిస్తున్నారు. కపర్ధి అక్కడినుంచీ రమ్మని పిలుస్తూనే కేరింతలు గొడుతున్నాడు.

నేను వెళ్లగానే "యిక్కడ మిగిలిన సమాజాల వాళ్ల అల్లరి భరించలేకపోతున్నాను. మనమంతా యేదో వొక గదిలోకి పోదాం పదండి. వెంటనే రిహార్సల్స్ మొదలు పెట్టాలి" అన్నాడు కపర్ధి.

నేను భామనే చూస్తూ "యిప్పుడు రిహార్సల్సా? యెందుకు?" అని ప్రశ్నించాను.

"నీ కోసమే! నిన్నరాత్రి నీ నటన అనుకున్నంత బాగా రాలేదు. కొత్తగదా! యింకా రిహార్సల్స్ కావాలి నీకు.. నిన్న ప్రదర్శనలా కాదు యివాళ్టి ప్రదర్శన. అందరూ గొప్పగా వుంటుందన్న నమ్మకంతో వస్తారు. యే మాత్రం పీలగా వున్నా చెడ్డ పేరొస్తుంది. పోదాం పద" అంటూ కపర్ధి మమ్మల్నందరినీ మూల గదిలోకి లాక్కెళ్లాడు.

అతను తలుపులు బిడాయిస్తుండగా "ఆయనే గాదు, యీ నాటకంలో యెవరు నటించకపోయినా ఫరవాలేదు. ఆ సంభాషణలు అలా చెబుతూ పోతే చాలు, నాటకం విజయవంతమైపోతుంది. అదీ ఆ స్క్రిప్టులో వుండే గొప్పతనం" అంది భామ నన్ను వోదార్చుతున్నట్టుగా.

"ముందుగా వాడు రాసిచ్చిన ముగింపే అయితే ప్రేక్షకులు రాళ్లు విసిరేసుంటారు. నేను బలవంతంగా మార్పించాను" అన్నాడు కపర్ధి కోపంగా.

"అదా సంగతి. యెందుకో చివరికొచ్చేసరికి నాటకం డల్లయినట్టు అనిపించింది నాకు. అయితే యిది ఆయన రాసిన ముగింపు కాదన్న మాట!" అంటూ భామ నాకేసి అనునయంగా చూసింది.

"వో పనిచేద్దాం కపర్ధీ! యీ రోజు ప్రదర్శనలో ముగింపును మార్చేద్దాం... ముందుగా నేను రాసినట్టుగా కథానాయిక యివ్వాళ ఆ రచయితనే చివరికి పెళ్లాడుతుంది. అలా చేశామనుకో, నాటకమూ పండుతుంది. కొత్త ముగింపు వచ్చేరికి ప్రేక్షకులూ దంగైపోతారు" అన్నాను వుక్రోషంగా.

కపర్ధి మౌనంగా అందరినీ కలయజూశాడు. తరువాత కుర్చీ లాక్కుని కూర్చుని "నాటకమనేది జీవితానికి అద్దంలాంటిది. దానికి వాస్తవికత ప్రాణం. ముందుగా నువ్వు చేసిన ముగింపు అవాస్తవం. యే స్త్రీ అయినా తన భర్త ప్రయోజకుడే కావాలని కోరుకుంటుంది. యేది కావాలంటే దాన్ని తెచ్చిపెట్టగలిగే సమర్థుడ్నే స్త్రీ కోరుకుంటుంది. గాలిలో రాతలు రాసే వాడివల్ల వొరిగేదేముంటుంది? వూహలతో కడుపునిండదు..." అని పాఠం చెప్పాడు.

"నేను కాదనలేదు. అయితే తెలివితేటలుండే స్త్రీకి ప్రయోజకుడిలో వుండే కార్యదీక్ష, రచయితలో వుండే భావుకత- రెండూ కావాలి" అన్నాను.

"అయితే ఆ రెండు లక్షణాలు యే ఒక్కరిలోనూ లేవుగదా! అప్పుడు ఆమె ఏం చేయాలి? సమస్యకు పరిష్కారం సహజంగా వుండాలి. ముందుగా ఆవిడ యెవర్ని యెన్నుకుంటుంది? చివరికి ఆమె ఎవరితో సంసారం చేయడాన్ని ప్రేక్షకులు

మెచ్చుకుంటారు?...." చెబుతూ చెబుతూ కపర్థి చివాలున భామకేసి తిరగి "పోనీ మేమయితే మగవాళ్ళం. మాకు ఆడవాళ్ళ మనస్సులో యేముంటుందో తెలియకపోవచ్చు. నువ్వు చెప్పు భామా? నువ్వే యీ పరిస్థితిలో వున్నావనుకో... యెవర్ని యెన్నుకుంటావు?" అని సూటిగా ప్రశ్నించేశాడు.

భామ బిక్కమొగమేసుకుని చుట్టూ చూసింది. గది లోపలున్న మిగిలిన వ్యక్తులందరూ తమాషా చూస్తున్నట్టుగా నిలబడి వున్నారు.

"సహజత్వం వుండాలంటున్నాడు కదా వీడు? నువ్వే చెప్పు! నీలాంటి స్త్రీకే యిలాంటి సమస్య వచ్చిందనుకో. యెవర్ని యెన్నుకుంటావు?" కపర్థి వెనక్కు తగ్గలేదు.

భామ పెద్దగా నిట్టూర్చింది. "నటిగా స్టేజీపై కొచ్చిన ఆడదంటే అందరికీ అలుసే! లేకపోతే నాకీ పిచ్చి పరీక్షలేమిటి?" అంది రౌద్రంగా. తరువాత "నేను నటిని. రచయిత యేం రాస్తే అది మాట్లాడతాను. దర్శకుడేం చెప్తే అది నటిస్తాను. అంతే!" అంటూ తలుపులు తెరచుకుని గబగబా బయటికెళ్ళిపోయింది.

మిగిలిన నటులందరూ నవ్వుల్ని దాచుకోలేకపోతూ జారుకున్నారు. గదిలో నేను కపర్థి మాత్రమే మిగిలాం.

"అయితే భామ నిన్ను పెళ్లి చేసుకుంటుందనా నీ వుద్దేశం?" కపర్థి ప్రశ్న పిడుగులా మోగింది.

"కాక నిన్ను పెళ్ళి చేసుకుంటుందంటావా?" నా ప్రశ్న వురుమై పేలింది.

"నాలో భావుకత లేదనా నీ వుద్దేశం?"

"నేను ప్రయోజకుడ్ని కానంటావా?"

"అని నువ్వేగదా రాసింది?"

"కథానాయికకు రెండు లక్షణాలూ వున్న వ్యక్తి కావాలని వుందని రాశాను."

"మరి... ఆవిడ యిక యివర్ని చేసుకుంటుందంటావు?"

"రచననయితే మార్చగలవు. జీవితాన్ని మార్చే దర్శకుడు వేరే వున్నాడు.."

"పిచ్చివాడా!" ... కపర్థి పెద్దగా నవ్వ బోయాడు. "నా ప్రేమ సంగతిని భామకు చెప్పేశాను. యికపైన ఆమెను నా నాటకాలకు పర్మినెంటు హీరోయిన్‌గా తీసుకుంటానని హామీ కూడా యిచ్చేశాను.... పెళ్ళికి ముహూర్తం చూడాలంతే!"

"ఆమె చెప్పిందా? నువ్వే వూహించుకుంటున్నావా?"

నేను కంగారును కప్పిపుచ్చుకోవడం కోసం సతమతమైపోయాను.

"ఆడవాళ్ళు అంత త్వరగా మనస్సు విప్పిచెప్పేస్తారా? యిదేనా నీకు తెలిసిన సహజత్వం? చూస్తూ వుండు జరిగేదేమిటో?..."

కపర్ధి పిడికిళ్ళు బిగించుకుని, కోపంతో బుసలుకొడుతూ బయటికెళ్ళిపోయాడు.

అందరమూ మధ్యాహ్నభోజనం సంగతి మరిచిపోయామన్న సంగతి జ్ఞాపకం వచ్చింది.

"సాయంత్రం ఆరుగంటలకంతా ప్రదర్శన ప్రారంభం కావాలి. అందరూ రెడీగా వుండండి" అంటూ కార్యనిర్వాహకులు హెచ్చరించిపోయారు

భామ కోసం వెతికాను. రెండు మూడు సార్లు బాదాక కానీ ఆమె గది తలుపులు తెరవలేదు. యేడవడంతో ఆమె కళ్ళు యెర్రగా మండుతున్నాయి.

"సారీ భామా! వాడి మాటలు పట్టించుకోవద్దు. కాస్సేపు నిద్రపో... ప్రదర్శన సక్రమంగా జరగనీ... మిగిలిన సంగతి రేప్పొద్దున ఆలోచిద్దాం..." అన్నాను.

ఆమె కళ్ళల్లోంచీ నీళ్ళు జలజలా బుగ్గల పైకి పాకాయి. "వాడు బండమనిషి. పువ్వుల్నెలా పట్టుకోవాలో వాడికెలా తెలుస్తుంది? పోనీ, మన్నించేయి..." అన్నాను.

బాధతో ఆమె పెదవులు వణికాయి. నిలువెల్లా కదలి పోతుండగా ఆమె తలుపులు వేసేసుకుంది.

సాయంత్రం ఆరు గంటలకంతా బహుమతి ప్రదానోత్సవం ప్రారంభమైంది. వుత్తమ ప్రదర్శన, వుత్తమ నటి, వుత్తమ రచన, వుత్తమ దర్శకత్వం మా నాటకానికే వచ్చాయి. మేమంతా మేకప్పు వేసుకునే బహుమతులు తీసుకున్నాం. వుత్తమ నటి షీల్డునందుకోవడానికి భామ కనబడలేదు. నేను కపర్ధిని పక్కకు లాగి "యెంత చనువుంటే మాత్రం, ఆడవాళ్ళతో అలానేనా మాట్లాడడం? యింకా యేడుస్తూనే వుందేమో! వెళ్లి క్షమాపణ చెప్పి తీసుకురా!" అని మందలించాను.

"వుత్తమ నటుడు కూడా రావల్సింది, నువ్వు ఆ పాత్ర కావాలని పట్టుబట్టకుండా వుంటే..." అంటూ కపర్ధి దబాయించాడు.

ప్రథమ బహుమతి పొందిన నాటకం ప్రారంభమవుతుందని ప్రకటించారు.

షీల్డులు చేత బట్టుకునే మేమంతా గ్రీన్ రూంలోకెళ్ళాం.

కపర్ధి హడావుడిగా వచ్చి "యీ సమయం లోనా అలగడం? భామను త్వరగా రమ్మన్నానని చెప్పండి" అని గర్జించాడు.

"చూశావా? బలంతో స్త్రీని గెలవలేం. స్త్రీ హృదయాన్ని అంత సులభంగా అర్థం చేసుకోలేవు" అన్నాను కపర్ధి భుజంపైన అనునయంగా చెయ్యేసి.

కపర్థి విసుగ్గా నా చేతిని దూరంగా తోసేసి "అప్పటికి నీకు మహా మగవాడి హృదయం అర్థమయినట్టు..." అని వెటకారం చేశాడు.

"యిప్పటికైనా అర్థంకాలేదా నీకు? బయటపడి చెప్పలేకపోయినంత మాత్రాన స్త్రీ హృదయంలో సంఘర్షణే వుండదనుకుంటున్నావా? ఆమెకు విచక్షణా జ్ఞానం లేకపోతుందా? ఆలోచించే మనస్సుండదా? యితరుల అభిప్రాయాలకనుగుణంగా నడవడానికి ఆమె కేవలం బొమ్మగాదు..." అన్నాను మరింత సాలోచనగా.

"సార్! సార్! కొంప మునిగింది" అంటూ వో సహాయ నటుడు గ్రీన్‌రూంలోకి పరిగెత్తుకొచ్చాడు.

"ముందు భామెక్కడో చూడు" కపర్థి గాండ్రించాడు.

"సాయంత్రం రైలెక్కేసిందట... వొంటరిగా కాదు. శ్రీవత్సతో పాటూ... వేరే పరిషత్తు వాళ్లు కూడా అదే రైలెక్కారట... వాళ్లే ఫోన్ చేశారు... భామా, శ్రీవత్సా నేరుగా తిరుపతికెళ్తున్నారట... పెళ్లి చేసుకోబోతున్నారట!" అతను చెప్పుకుపోతూనే వున్నాడు.

భామ ప్రవర్తనకు మొదటినుంచీ నాకు తెలియని మరో అంతరార్థం కూడా వుండేదా? ఆమె మానసిక సంఘర్షణకు మూలమైన అంతర్యుద్ధంలో మరో పాత్ర కూడా వుందా? యీ మధ్యకాలంలో ఆమెలో కనిపించిన అలజడికి మరో వ్యక్తి కూడా కారణమయ్యాడా? మా యిద్దరినీ కాదని ఆమె యెన్నుకున్న ఆ మూడో వ్యక్తి మా కంటే యే రకంగా మెరుగైనవాడు?

నాకెందుకో కళ్లు తిరిగినట్టుగా తోచింది.

నా చేతుల్లోని మొమెంటో జారి, నేలపైన పడి, మూడు ముక్కలైపోయింది.

విపుల, సెప్టెంబర్ 2009